

ఉద్యాన్ పార్కును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బోర్డు నామినేటెడ్ మెంబర్ రామకృష్ణ

కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కు ప్రారంభం

మారేడ్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్ కాలనీలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నాలుగు వేల చదరపు గజాలలో అన్ని హంగులతో నిర్మించిన కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కును కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. ఉద్యాన్ పార్కులో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, స్కేటింగ్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం కలిగిన మైదానాన్ని స్థానిక కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు ప్రెసిడెంట్ కె.సోమశేఖర్, బోర్డు నామినేటెడ్ మెంబర్ జి.రామకృష్ణ, సీఈఓ మధుకర్ నాయక్, ఇంజనీర్‌లు, అధికారులు, నాయర్, గోపాలదాస్ కృష్ణ, ఉమాశంకర్, ఫణికుమార్, దినేష్, ఎం.రాజకుమార్, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సూచనలతో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో

● ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



ఉపాధ్యాయుల అభిప్రాయాలను డ్రాప్ బాక్స్ ద్వారా సేకరిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

సికింద్రాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సలహాలు, సూచనలతోనే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందిస్తామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టో రూపొందించనున్న నేపథ్యంలో అన్నివర్గాల ప్రజల సూచనలు తీసుకోవడంలో భాగంగా గురువారం సికింద్రాబాద్ ఆర్‌జీఆర్ సిద్ధాంతి కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది అభిప్రాయాలను డ్రాప్‌బాక్స్ ద్వారా సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కళాశాల చైర్మన్ పి.ఎల్.శ్రీనివాస్, ఓబీసీ మహిళా మోర్చా అధికార ప్రతినిధి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించే ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ నెల 10న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, దీనిలో కులసంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు చంద్రశేఖర్, ఎడెల్లి అజయ్ కుమార్, సి.కృష్ణగౌడ్, సందీప్‌సాయి, వినయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, మేకల సారంగపాణి, పూస రాజు, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న కేటీఆర్'

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జెల కాంతం విమర్శించారు. రాజకీయాలపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గురువారం గాంధీభవన్‌లో గజ్జెల కాంతం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ తెచ్చిన అన్ని చట్టాలకు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డూరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిశారని.. ప్రధానిని ఒక ముఖ్యమంత్రి పెద్దన్న అంటే తప్పేమీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి కోసమే సీఎంగా రేవంత్‌రెడ్డి పీఎం మోదీకి వినతిపత్రాలు ఇచ్చారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే బీఎస్పీతో సైతం పొత్తుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు.

నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పోస్టుల సంఖ్యను పెంచేలా ప్రయత్నిస్తానన్నారు.

రసాయనశాస్త్రంలో విస్తృత పరిశోధనలు జరగాలి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ప్రొ. గోవర్ధన్ మెహతా తదితరులు

తార్నాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని రసాయనశాస్త్రంలో పరిశోధనలు మరింత విస్తృతంగా జరపాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) మాజీ వీసీ ప్రొ.గోవర్ధన్ మెహతా అన్నారు. నేచర్ ఇన్‌స్పైర్డ్ ఇనిషియేటివ్స్ ఇన్ కెమికల్ ట్రెండ్స్ అనే అంశంపై తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ. గోవర్ధన్ మెహతా మాట్లాడుతూ మానవజాతి ఆరోగ్య పరిరక్షణకు రసాయనశాస్త్రం, జీవశాస్త్రంలో సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే అద్భుత ఫలితాలను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. సదస్సు కన్వీనర్ డా. సీహెచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌తరాలకు ఉపయోగపడేవిధంగా నూతన ఆవిష్కరణలు ఏవిధంగా చేయాలి అనే దానిపైన మూడురోజుల అంతర్జాతీయ సదస్సులో విస్తృతంగా చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డా.చంద్రశేఖర్, ఐఐసీటీ డైరెక్టర్ డా.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోటలు సాగుచేసిన వారికి పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిద్దెతోటలు సాగుచేసిన వారికి రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని 24 మందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రైతునేస్తం కార్యక్రమంలో మిద్దెతోటల అంశాన్ని కూడా చేరుస్తామని హామీ ఇచ్చారు. మహిళలు మిద్దెతోటలపై దృష్టిపెట్టాలని, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే కూరగాయలు పండించాలని, ఆరోగ్య తెలంగాణను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, తుమ్మేటి రఘోత్తంరెడ్డి, పిన్నక పద్మ పాల్గొన్నారు.

పిస్తాహౌజ్‌లో దాడికి పాల్పడిన ఆరుగురి రిమాండ్

రాజేంద్రనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న అర్ధరాత్రి 12:30 గంటలకు ఉప్పర్‌పల్లి పిస్తాహౌజ్‌లోకి వెళ్లి అక్కడ భోజనాలు చేస్తున్న కస్టమర్లతో పాటు సిబ్బందిపై దాడి చేసిన కేసులో ఆరుగురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నౌ నంబర్‌కు చెందిన అయూబ్, తాజుద్దీన్, బాబా, షరీఫ్, బబ్లూ అలియాస్ ఇమ్రాన్, ముస్తాఫా పిస్తా హౌజ్‌కు వెళ్లి అర్ధరాత్రి బిర్యానీ అడిగారు. సమయం మించిపోయింది. బిర్యానీ లేదని అక్కడున్న మేనేజర్ మతిన్ తెలిపాడు. దీంతో రెచ్చిపోయిన ఆ ఆరుగురు వ్యక్తులు హోటల్‌లో ఉన్న వారిపై, సిబ్బందిపై దాడి చేశారు. మేనేజర్ మతిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

● వేలాదిగా తరలిరానున్న భక్తులు



అన్మగల్ హయత్‌నగర్‌లో స్వయంభువుగా వెలసిన శివలింగం

హయత్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రిని పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. అన్మగల్ హయత్‌నగర్‌లోని చారిత్రక రామలింగేశ్వరస్వామి, శాంతినగర్ కల్వంచలోని సోమేశ్వర ఆలయం, వీరన్నగుట్టలోని భద్రకాళీ రామలింగేశ్వర క్షేత్రం, శాంతినగర్‌లోని కంఠమహేశ్వరస్వామి ఆలయం, ఆర్టీసీ కాలనీలోని లక్ష్మీగణపతి ఆలయంలోని మహాత్రిపుర సుందరి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, ఇంజాపూర్‌లోని శివాలయాలు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అన్మగల్ హయత్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. అభిషేకాలు, అఖండ దీపారాధన, అంకురార్పణం, గణపతి హోమం, పుణ్యవచనం, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పిసాటి సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు శ్రీనివాస్, కార్యదర్శి బండారు స్వామి, కోశాధికారి కళ్లెం పద్మారెడ్డి, సంయుక్త కార్యదర్శి కొత్తపల్లి లింగాచారి తెలిపారు. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉదయం 4గంటల నుంచే స్వామి వారికి అభిషేకములు, బిల్వార్చన, పత్రిపూజ జరుగుతాయని వారు తెలిపారు.

కల్వంచ సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

శాంతినగర్(కల్వంచ) చారిత్రక సోమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో ప్రతి శివరాత్రికి ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శివరాత్రి రోజున ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సామూహిక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు పార్వతీపరమేశ్వరుల దివ్యకల్యాణం కనుల పండుగగా జరిపిస్తారు.

కొత్తపేట : కొత్తపేట డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలో వెలసిన గోదాసమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, సెక్రెటరీ ప్రసన్నకృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవిల పర్యవేక్షణలో భక్తుల ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, సాయంకాలం 5 నుంచి 7.30 వరకు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 8.30 నుంచి 10.30 వరకు నిర్వహించే శివపార్వతుల కల్యాణోత్సవ వ్యాఖ్యానం విష్ణుబొట్ల అవినాష్‌శర్మ చేయనున్నారు. అనంతరం రాత్రి 10.30 నుంచి 12.30 వరకు లింగోద్భవ రుద్రాభిషేకం, అన్నాలంకరణ నిర్వహిస్తున్నారు. కొత్తపేటలోని పురాతన శ్రీప్రసన్న మహాకాళీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివగంగ కాలనీలోని సదాశివేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభయ్యాయి.

పెద్దఅంబర్‌పేట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్ : మహా శివరాత్రిని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని కామాక్షీపీటం, పెద్దఅంబర్‌పేట్‌లోని శివాలయాన్ని నిర్వహకులు ముస్తాబు చేశారు. శివరాత్రి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

మూసారాంబాగ్‌లో..

చాదర్‌ఘాట్: శాలివాహననగర్ కాలనీలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర పంచాయతన దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున 4గంటల నుంచే రుద్రాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొంతుల మాణిక్‌రెడ్డి తెలిపారు. సలీంనగర్‌లోని షిరిడీ సాయిబాబా సంస్థాన్‌లోని శివాలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు,



ముస్తాబైన అన్మగల్ హయత్‌నగర్‌లోని చారిత్రక శివాలయం

శివపార్వతుల కల్యాణం, బిల్వార్చన, లఘున్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సంస్థాన్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ రెడ్డి తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని మారుతిమందిర్‌లో గల శివాలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లో..



శివాలయంలో నిత్య పూజలందుకుంటున్న శివలింగం

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లోని పలు శివాలయాలు ముస్తాబయ్యాయి. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలోని ఉప ఆలయాలలో కొలువుదీరిన నాగేశ్వర, స్ఫటిక లింగేశ్వర, విశ్వనాథ స్వామిలకు ఈ నెల 8న శివరాత్రి సందర్భంగా ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రత్యేక రుద్రాభిషేకం, రుద్ర హోమం, రాత్రి 10:30 గంటలకు లింగోద్భవ కాలం, రాత్రి 1:30గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ తెలిపారు.

చేవెళ్ల నుంచి పట్నం, పట్లోళ్ల కుటుంబాలను తరిమికొట్టాలి

● బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సరూర్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పట్నం, పట్లోళ్ల కుటుంబాలను తరిమికొట్టి వారి కబంధ హస్తాల నుంచి ఈ ప్రాంతాన్ని కాపాడాల్సిన అవసరం ఉన్నదని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల బీజేపీ కార్యాలయంలో బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం కొండా మాట్లాడుతూ అధికార వ్యామోహంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారే పట్నం, పట్లోళ్ల కుటుంబాల రాజకీయ దాహానికి అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. మోదీ కలలుగన్న వికసిత్ భారత్ సంకల్పంతో వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, రామోజీ అమితాశ్రీశైలంచారి, రామిడి మాధురీవీరకర్ణారెడ్డి, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, పార్టీ నాయకులు గడ్డం వెంకటేశ్, రామిడి శూరకర్ణారెడ్డి, కొంతం సంపత్‌రెడ్డి, రాంరెడ్డి, రామకృష్ణారెడ్డి, రవి, లక్ష్మారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నేతలను కలిసిన మాధవీలత



మాధవీలతను సత్కరిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి దంపతులు, కార్పొరేటర్

సైదాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత గురువారం సైదాబాద్‌లో పార్టీ ముఖ్యనేతలను కలిశారు. అండగా నిలిచి పార్టీ విజయానికి సహకరించాలని ఆమె కోరారు. భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీలను నివాసాలకు వెళ్లి కలిశారు. డివిజన్ ముఖ్య నేతలను పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాధవీలతను సత్కరించారు.

మాధవీలతను కలిసిన కార్పొరేటర్

చాదర్‌ఘాట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవిలతను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డితో కూడిన బృందం శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మోదీ గ్యారెంటీ పథకాలతో ప్రజల్లోకి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించి మాధవిలత విజయం కోసం తమ వంతు కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, నాయకులు తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, మందడి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మూసారాంబాగ్ బ్రిడ్జి రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పుచేయాలి : బలాల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల, పక్కన రిటైర్డ్ జడ్జి బాషా నవాజ్‌ఖాన్ తదితరులు

చాదర్‌ఘాట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో రోడ్డుకిరువైపులా ఒకే విధంగా వీలైనంత తక్కువ ఆస్తులు కూల్చివేసేలా అలైన్‌మెంట్‌లో మార్పు చేయాలని జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారులకు సూచించినట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. బుధవారం రాత్రి మూసారాంబాగ్ బ్రిడ్జి పునఃనిర్మాణం కారణంగా ఆస్తులను కోల్పోనున్న బాధిత కుటుంబీకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి ఎత్తు కొంతవరకు తగ్గించేలా రీ డిజైన్ చేయాలని ఇదివరకే సూచించానని, ఈమేరకు ప్రాజెక్ట్ అధికారులు కొంతవరకు మార్పు చేశారని, దీని ద్వారా బ్రిడ్జి ర్యాంపు పొడవు కూడా కొంతవరకు తగ్గే అవకాశముందన్నారు. కార్యక్రమంలో బాధిత కుటుంబీకులైన రిటైర్డ్ జడ్జి బాషా నవాజ్‌ఖాన్, పి.అశోక్‌కుమార్, రాజశేఖర్, ధనుంజయ్, ఆనంద్, శ్రీనివాస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతులయ్యారు : ఎమ్మెల్యే



మహిళా చైతన్యం మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో ముందడుగు వేస్తు చైతన్యవంతులయ్యారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శాతవాహననగర్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీహాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా చైతన్యం మేళా ను ఏర్పాటు చేశారు. ఈ మేళాను సుధీర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వైవిధ్య భరితమైన వ్యాపార మెళుకువలను ప్రదర్శిస్తు రాణించడం అభినందనీయమన్నారు. శాతవాహననగర్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఉమారెడ్డి, కార్యదర్శి నాగలత పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కొత్తపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ పెద్ద వరమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ మారుతీనగర్‌కు చెందిన సురేష్‌కు ఓపెన్ హార్ట్ సర్జరీకి అవసరమైన రూ.1.50లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయింది. సదరు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీని గురువారం ఎమ్మెల్యే బాధితుడి బంధువు శైలేందర్‌కు అందజేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

చంపాపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని సాయినగర్‌కాలనీలో గురువారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పర్యటించారు. కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.29లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాజు, శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు బాల్‌రాజ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి : కార్పొరేటర్

చంపాపేట : హస్తినాపురం డివిజన్‌లోని వివిధ కాలనీలు, బస్తీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సహకరించాలని కార్పొరేటర్ సుజాతానాయక్ జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డీసీ జాకియా సుల్తానాను కోరారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో గురువారం కార్పొరేటర్ డీసీని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ పనుల పరిశీలన

వనస్థలిపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని క్రిస్టల్ విల్లాస్ వద్ద జరుగుతున్న బాక్స్‌డ్రైన్ పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ గురువారం పర్యవేక్షించారు. సౌభాగ్యనగర్ కాలనీ అధ్యక్షుడు నందకిషోర్, జక్కిడి కాలనీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, లక్ష్మీపతి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయ పీఠాధిపతులకు ఘనస్వాగతం



మంత్రాలయ పీఠాధిపతులు సుబుధేంద్రతీర్థ శ్రీపాదులకు స్వాగతం పలుకుతున్న పూర్ణప్రజ్ఞ ట్రస్టు ప్రతినిధులు

ఎల్బీనగర్ : ఆర్‌కేపురం డివిజన్‌లోని అలకాపురి రాఘవేంద్రస్వామి మృత్తికా బృందావన ప్రతిష్ఠాపన రజతోత్సవాల్లో పాల్గొనేందుకు జగద్గురు శ్రీమాన్ మధ్వాచార్య మూల మహా సంస్థానం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులైన 1008 సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులు గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. కొత్తపేట వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయం వద్ద శ్రీపాదులకు స్వాగతం పలికి పుర వీధుల గుండా అలకాపురిలోని రాఘవేంద్రస్వామి మఠం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. శ్రీ మఠంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీమూల రాముల వారి పూజ, తులాభారం అనంతరం ఫలమంత్రాక్షత వితరణం చేశారు.



వెంకటాద్రినగర్ కాలనీలో రోడ్డు నిర్మాణం కోసం చదును చేసి వదిలి వేసిన రోడ్డు



అభివృద్ధికి నోచుకోకుండా గాయత్రీనగర్ నుంచి వెంకటాద్రినగర్ వరకు ఉన్న మట్టి రోడ్డు

30 ఏళ్ల కాలనీ.. మట్టి రోడ్డే దిక్కు

- హయత్‌నగర్ డివిజన్‌లో దుమ్మురేగుతున్న వెంకటాద్రినగర్ కాలనీ ప్రధాన రోడ్డు
- పన్నుల వసూలుపైనే అధికారుల శ్రద్ధ
- వసతులు పట్టని పాలకులు

హయత్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ డివిజన్‌లోని శివారు కాలనీలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం మూలంగా నేటికి మట్టి రోడ్లతోనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి హయత్‌నగర్ డివిజన్‌లో నెలకొంది. రోజు రోజుకూ కాలనీల సంఖ్య పెరుగుతుందే తప్ప అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. 30 సంవత్సరాల క్రితం ఏర్పడిన కాలనీలకు సైతం నేటికి మట్టి రోడ్లే ఉండడం ఇక్కడ ప్రత్యేకత. 30 సంవత్సరాల క్రితం ఇళ్లు నిర్మించుకుని ప్రతి సంవత్సరం జీహెచ్‌ఎంసీకి ట్యాక్సులు చెల్లిస్తున్నా అభివృద్ధి పనులు మాత్రం ఈసమంతైన జరగడం లేదని పలు కాలనీ ప్రజలు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని అనేక కాలనీల్లో తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్‌లు, అంతర్గత రోడ్లు, వీధి దీపాలు లేక ప్రజలు నానా అవస్థలు పలుడుతున్నారు. అయినా అధికారులు అభివృద్ధిపైన దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు ప్రధాన ఉదాహరణగా డివిజన్‌లోని మారం అపార్టుమెంట్ నుంచి గాయత్రినగర్ వరకు ఉన్న మట్టి రోడ్డునే చెప్పవచ్చును. ఏళ్లు గడుస్తున్నా ఈ రోడ్డును మాత్రం బాగు చేయడం లేదు. వర్షాకాలంలో నైతే ఈ రోడ్డు గుండా నడవడమే కష్టంగా మారుతుంది. నాలుగు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు మొత్తం బురద మయంగా మారింది. దీంతో వెంకటాద్రినగర్‌కాలనీ, సత్యనారాయణకాలనీ, వెంకటేశ్వనగర్‌నగర్ కాలనీల ప్రజలు రోడ్డుపైన నిరసన వ్యక్తం చేస్తూ బురదగా మారిన రోడ్డుపైన వరి నాటేశారు. అయినా అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. మారం అపార్టుమెంటు నుంచి వెంకటాద్రినగర్, గాయత్రినగర్ మీదుగా దేశ్‌ముఖ్ సాయి కాలనీ వరకు ఉన్న సుమారు 2కిలో మీటర్ల మట్టి రోడ్డు దుమ్ము రేగుతున్నది. దాదాపు పదిహేను కాలనీలకు ఈ రోడ్డే ప్రధాన రోడ్డు కావడం విశేషం. అయినా అధికారులు మాత్రం రోడ్డు అభివృద్ధిని గాలికి వదిలేశారు.

భూగర్భ డ్రైనేజీ లైన్ పూర్తి కాగానే సీసీ రోడ్డు



వెంకటాద్రినగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం సుమారు రూ.80లక్షలు మంజూరు అయ్యాయి. మారం అపార్టుమెంటు నుంచి గాయత్రి కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు ఎమ్మెల్యే, తాను శంకుస్థాపన చేశాం. వెంకటాద్రికాలనీలో అంతర్గత భూగర్భ డ్రైనేజీ లైన్లు మంజూరు అయ్యాయి. ఇప్పుడే సీసీ రోడ్డు నిర్మిస్తే ఆరు చోట్ల భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ కోసం సీసీ రోడ్డు ధ్వంసం చేయాల్సి వస్తుంది. అందు చేతనే అధికారులు సీసీ రోడ్డు పనులు నిలిపి వేశారు. డ్రైనేజీ లైను పూర్తి కాగానే సీసీ రోడ్డు వెంటనే వేయిస్తాం

- కళ్లెం నవజీవన్‌రెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్

డ్రైనేజీ పనుల కోసం ఆపాం

వెంకటాద్రినగర్ కాలనీలో అంతర్గత భూగర్భ లైన్లు నిర్మించేందుకు వాటర్ వర్క్స్ అధికారులు పనులు ఆపమన్నారు. ఆరు రోడ్ల వద్ద మ్యాన్‌హోల్స్ కోసం పని ఆపాల్సి వచ్చింది. అంతర్గత భూగర్భ డ్రైనేజీ లైను నిర్మాణం కోసం టెండర్ కూడా అయిందని, పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు వాటర్ వర్క్స్ అధికారులు చెప్పారు. డ్రైనేజీ లైను పూర్తి కాగానే సీసీ రోడ్డు పూర్తి చేస్తాం.

- చంద్రశేఖర్, ఏఈ హయత్‌నగర్ డివిజన్